

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
ఆదివారం 21 సెప్టెంబరు 2025





మంజీరా బ్యారేజీని సందర్శించిన సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

పర్యాటక కేంద్రంగా 'మంజీరా'

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంజీరా బ్యారేజీని పర్యాటక కేంద్రంగా మారుస్తామని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం కల్పగూర్‌లో ఉన్న ప్రాజెక్టును శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మంజరా డ్యాంను పర్యాటక కేంద్రంగా, పర్యావరణ విద్యా కేంద్రంగా తర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. పర్యావరణ వైవిధ్యం గురించి విద్యార్థులు తెలుసుకునేలా, విద్యా సంబంధిత కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనువుగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డ్యాంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో నాలుగు క్రస్టు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ పరిధిలోని ప్రాంతాలను పరిశీలించి వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన చిన్న చెరువును పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్‌రావు, నీటిపారుదల శాఖ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జైభీమ్, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌అండ్‌ఎస్‌బీ డిప్యూటీ జనరల్ మేనేజర్ అజీజుద్దీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి దేవుళ్లు, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏడుపాయల, కేతకీలో నవరాత్రి ఉత్సవాలు



మెదక్/ఝరాసంగం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం, ఝరాసంగం కేతకీ సంగమేశ్వర ఆలయాల్లో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏడుపాయల ఆలయ అధికారులు శనివారం మెదక్ కలెక్టర్‌ను కలిసి ఆహ్వానం అందజేశారు.

బతుకమ్మ పాట ఆవిష్కరణ

మెదక్ అర్బన్: సాంస్కృతిక సారథి కళాకారుడు మదన్ ఆధ్వర్యంలో రూపొందించిన బతుకమ్మ పాటను శనివారం మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆవిష్కరించారు.

వెయ్యి మంది విద్యార్థినులకు సరిపడా
కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణం

- అక్టోబరు 10 వరకు ప్రతిపాదనలు, నమూనాలు సిద్ధం చేయాలి
- డైనింగ్‌హాల్, క్లాస్, స్టాఫ్‌రూమ్స్, లైబ్రరీ, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, ఆడిటోరియం కోసం ప్రతిపాదనలు
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీదర్‌బాబు, వివేక్‌ల దృష్టికి తీసుకెళ్తాను
- నిర్మల ఇక్కడే చదివారు.. నేను కూడా స్టూడెంట్ లీడర్‌గా ఆ రోజుల్లో ఈ కాలేజీకి వచ్చేవాడిని
- ఆనాడు ర్యాగింగ్ నిర్మూలన కోసం నాగలక్ష్మి అనే అమ్మాయి పోరాటం చేసి ఆత్మహత్య చేసుకోవడంతోనే మహిళలకు ప్రత్యేక డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటయ్యాయి
- సంగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాల, హాస్టల్‌ను సందర్శించిన జగ్గారెడ్డి, నిర్మల



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది



మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధిపై సూచనలు ఇస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 1000 మంది విద్యార్థినులకు సరిపడా సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్, కళాశాల భవనాల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాల, హాస్టల్‌ను శనివారం వారు సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. కళాశాలలో క్లాస్‌రూమ్స్, స్టాఫ్‌రూమ్స్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ ఆడిటోరియం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అక్టోబరు 10వరకు ఎస్టిమేషన్లు, డిజైన్లు సిద్ధం చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, వివేక్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. గడిచిన పదేళ్లు తాను అధికారంలో లేనని, ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి చేశానని, ఈ పదేళ్లు ఈ ఊరు కోసం ఛాలెంజ్‌గా తీసుకొని అభివృద్ధి చేస్తానని అన్నారు. రాజకీయాల మీద తనకు పెద్దగా ఆశ లేదని, తమ పార్టీ అధికారంలో ఉన్నందున తను చెబితే సీఎం మినిస్టర్లు వింటారని తెలిపారు. ఒక వ్యక్తిగానే తాను కళాశాలకు వచ్చానని, చాలెంజ్‌గా తీసుకొని ఈ కళాశాలను అభివృద్ధి చేస్తానన్నారు.

బతుకమ్మ సంబరాలు



సంగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయి. నేటి నుంచి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో శనివారం పలు స్కూళ్లల్లో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. మరోవైపు నేడు పెత్రమాస నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వేడుకలకు ఘనంగా జరుపుకునేందుకు ఊరూవాడా సిద్ధమైంది. తొమ్మిది రోజులు సాగనున్న పూల పండుగ ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగియనుంది.



తూప్రాన్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సంగారెడ్డి కొత్తబస్టాండ్‌లో..



సంగారెడ్డి బీసీ గురుకులం విద్యార్థులు..

ఊరికి పోదాం..

స్కూళ్లకు దసరా సెలవులు.. సొంతూళ్లకు విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు రావడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో శనివారం నుంచి అక్టోబరు 3 వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. దీంతో గురుకులాలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు సామగ్రిని సర్దుకొని సొంతూళ్లకు పయనమయ్యారు. విద్యార్థులను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు తరలిరావడంతో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి.

మెదక్ రీజియన్‌లో 356 ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మెదక్ రీజియన్ పరిధిలో శనివారం నుంచి 356 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21న ఆరు బస్సులు, 22న 25 బస్సులు, 23న 24 బస్సులు, 24న 37 బస్సులు, 25న 33 బస్సులు, 26న 36 బస్సులు, 27న 40 బస్సులు, 28న 41 బస్సులు, 29న 35 బస్సులు, 30న 24 బస్సులు, 31న 24 బస్సులు, అక్టోబరు 1న 17 బస్సులు, 2న 15 బస్సులు నడపనున్నట్లు తెలిపారు.



పండుగకు ఊరెళ్తున్నారా.. జరభద్రం..!



- పది రోజులు విద్యా సంస్థలకు సెలవులు
- సొంతూళ్లకు వెళ్లేందుకు పట్టణవాసుల క్యూ
- సమాచారమివ్వాలని పోలీసుల సూచన
- జాగ్రత్తలు పాటించాలంటున్న ఎస్పీలు

7



అనుసూజ సమాధి తవ్వుతున్న పోలీసులు

అప్పుడు భర్తకు.. ఇప్పుడు భార్యకు..

- ఇద్దరి మృతదేహాలు వెలికి తీసి డీఎన్ఏ టెస్ట్.. రెండూ మిస్సింగ్ కేసులే
- ఎనిమిదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. తమవాడేనంటూ తీసుకెళ్లి కర్మకాండలు
- డీఎన్ఏ టెస్ట్‌లో మునిపల్లివాసిగా ఫలితం
- ఏడాది క్రితం ఏడుపాయలలో హత్యకు గురై కాలిన స్థితిలో మహిళ మృతదేహం గుర్తింపు
- తీసుకొచ్చి కర్మకాండలు చేసిన కొడుకు.. డీఎన్ఏ టెస్ట్‌లో సరిపోలక మరోసారి పరీక్షలు

7



మత్తుపదార్థాలను దహనం చేస్తున్న అధికారులు

అల్ఫాజోలం, గంజాయి, మత్తుపదార్థాల దహనం

సంగారెడ్డి క్రైం/పటాన్‌చెరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 20 కేసుల్లో సీజ్ చేసిన ఎండు గంజాయి, అల్ప్రాజోలం, ఎండీఎంలను ఎస్పీ పరితోష్ పంకజ్ పర్యవేక్షణలో దహనం చేశారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పాశమైలారం పారిశ్రామికవాడలోని మెడికేర్ పరిశ్రమలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా 583 కిలోల ఎండుగంజాయి, 1.777 కిలోల అల్ప్రాజోలం, 980 గ్రాముల ఎండీఎంలను కోర్టు అనుమతితో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేశామని ఎస్పీ పేర్కొన్నారు. నిబంధనల పాటిస్తూ ఈ ప్రక్రియను చేపట్టినట్లు ఆయన వివరించారు. జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడానికి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ బృందాలు జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించి, సరఫరా చేసినా, లేదా సాగు చేసిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డ్రగ్ డిస్పోజల్ కార్యక్రమంలో డీఎస్పీలు సత్యయ్యగౌడ్, ప్రభాకర్, సురేందర్ రెడ్డి, మెడికేర్ ఎన్విరాన్‌మెంటల్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బి.రమేష్, ఎస్‌న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, సీఐలు వినాయక్‌రెడ్డి, విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

అనుమతుల దందా

త్వరలో మున్సిపాలిటీలో విలీనం ప్రచారం

- కందిలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలకు పర్మిషన్లు
- వసూళ్ల కోసం ప్రత్యేకంగా సిబ్బంది
- రూ. కోట్లలో దండుకుంటున్న వైనం
- హెచ్‌ఎండీఏ ఆదాయనికి గండి

కంది, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కంది పంచాయతీలో ప్రత్యేకాధికారుల పాలన గాడి తప్పింది. అక్రమ నిర్మాణాలకు అడ్డు లేకుండా పోయింది. త్వరలో సంగారెడ్డి మున్సిపాలిటీలో కలవబోతుందని చేస్తుండటంతో స్వయంగా పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రచారం చేస్తూ.. ఇష్టారాజ్యంగా నిర్మాణ అనుమతులు ఇస్తూ దండుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హెచ్‌ఎండీఏ అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు, డూప్లెక్స్ ఇళ్లు, కమర్షియల్ నిర్మాణాలకు అనుమతులిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని చెప్పుకుంటున్నారని, ఇందుకు తగినట్లే జిల్లాస్థాయి అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. అక్రమ నిర్మాణాలపై స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పేర్కొంటున్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

కంది గ్రామంలో రెండేళ్లుగా ఇష్టారాజ్యంగా నిర్మాణాలకు అనుమతులు మంజూరయ్యాయి. ఏడాదిలోనే కంది విజ్ఞాన్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, సాయి కాలనీలో 100 వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. పదుల సంఖ్యలో మార్బుల్ దుకాణాలు, దాబాలు ఇతర వ్యాపార సముదాయాలు నిర్మించారు. వాటిలో ఒక్కదానికి కూడా సెట్‌బ్యాక్ వదలలేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తున్నది.

> **చర్యలు తీసుకుంటాం**
>
> కందిలో హెచ్‌ఎండీఏ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అపార్ట్‌మెంట్లు, సెట్‌బ్యాక్ వదలని ఇళ్లకు నోటీసులు జారీ చేస్తాం. 300 గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడితే హెచ్‌ఎండీఏ, పంచాయతీ అనుమతులు తప్పనిసరి.
>
> -మహేదర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి



కందిలో హైవే పక్కనే నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్

హెచ్‌ఎండీఏ ఆదాయనికి గండి

పంచాయతీ పరిధిలో మూడంతస్థులు (జీ-ప్లస్ టు) ఇళ్లకు, 300 గజాల వరకు వ్యాపార సముదాయాలకు అనుమతి ఇవ్వవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే ఇటీవల నిర్మించిన ఇళ్లు, వ్యాపార సముదాయాలు నాలుగు అంతస్థులకు పైగా ఉన్నాయి. అనుమతి లేకుండా సెల్లార్‌లు కూడా నిర్మించారు. వ్యాపార సముదాయాలకైతే లెక్కే లేదు. 300 గజాలకు పైగా నిర్మించినట్లు ఆధారాలున్నా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, లేదంటే

మిగతా 8వ పేజీలో



పార్థ కాలనీకి వెళ్లే దారిలో వరద నీరు

జలదిగ్బంధంలో కాలనీలు

14 కాలనీలను ముంచెత్తిన వరద.. కల్వర్టును మూసేందుకు గ్రామస్థుల యత్నం

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పరిధిలోని చిట్కుల్ గ్రామలో 14 కాలనీలో జలదిగ్బంధంలో చిక్కుకుని ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ముత్తంగి ఎన్కచెరువు అలుగు పోస్తుండటం, ఇస్నాపూర్ నుంచి వస్తున్న మురుగునీరు, నక్కవాగు నీరు కాలనీలను ముంచెత్తింది. కాలనీలో మోకాలి లోతు నీరు వచ్చింది. చిట్కుల్ పరిధిలోని ఓడీఎఫ్, రాధమ్మ కాలనీ, నాగార్జునకాలనీ, సాయి నగర్ కాలనీ, బాలాజీ హోమ్స్ సుదర్శన్ కాలనీ, బాలాజీ హైట్స్, రాయల కాలనీ, బృందావన్ కాలనీ, ఎస్‌ఆర్ కాలనీ, ద్వారకానగర్, పార్థసారథినగర్, పార్థకాలనీలు వరద నీటిలో ఉన్నాయి. కాలనీలన్నీ నీటిలో ఉండటంతో జనంతో బయటి వారికి సంబంధాలు తెగిపోయాయి. స్కూల్ బస్సులు కూడా రావడం లేదు. కాలనీల నుంచి వరద బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలు కూరగాయలు కూడా తెచ్చుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై ముత్తంగి హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద కల్వర్టు గుండా నీరు కాలనీల్లోకి వస్తుండటంతో ఆ కల్వర్టును మూసేందుకు శనివారం కాలనీల వారు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఎక్స్‌కవేటర్‌తో మట్టి వేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారి ప్రవీణ్ వచ్చి అక్కడి వారికి నచ్చజెప్పారు. ఇక్కడ నాలా నిర్మిస్తామని చెప్పారు. దీంతో కాలనీవాసులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. కాలనీలను ముంచెత్తిన నీరు బయటకు వెళ్లేలా తాత్కాలికంగా చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిట్కుల్ మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ నాయకులు నరేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ గత ఏడాది అధికారులు వచ్చి శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పినా.. పనులు మాత్రం చేయలేదని మండిపడ్డారు.



జలదిగ్బంధంలో ఓడీఎఫ్ కాలనీ

రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు

రేగోడు సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రేగోడు పోలీసులు పట్టుకుని శనివారం కేసు నమోదు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి రేగోడు మండలంలోని పోచారం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు బొలేరో వాహనాన్ని పరిశీలించగా బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. రేగోడు మండలం పెద్దతండా నుంచి రేషన్ బియ్యాన్ని నారాయణఖేడ్‌కు తరలిస్తున్నట్టు గుర్తించారు. శనివారం రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల ద్వారా విచారణ జరిపించగా 30క్వింటాల రేషన్ బియ్యంగా గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి


ప్రశాంత్(ఫైల్)

మనూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండల పరిధిలోని శెల్గిరా గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. గ్రామానికి చెందిన బేగరి లక్ష్మణ్ రెండో కుమారుడు బేగరి ప్రశాంత్(14)కు ఈనెల 17న జ్వరం వచ్చిందని గ్రామంలోని ఆర్‌ఎంపీ యూనుస్ వద్దకు తీసుకెళ్లాడు. రెండు ఇంజక్షన్లు ఇచ్చి అనంతరం మందులు ఇచ్చి పంపించాడు. అయినప్పటికీ ప్రశాంత్‌కు జ్వరం తగ్గక పోవడంతో 18న మళ్లీ ఆయన వద్దకే తీసుకు వెళ్లగా సెలైన్ పెట్టి పంపించాడు. దీంతో ఆర్‌ఎంపీ డాక్టర్ యూనుస్ వైద్యం వికటించి, ప్రశాంత్‌కు జ్వరం మరింతగా పెరిగి పోయింది. 19న యూనుస్ వద్దకే తీసుకెళ్లగా, ప్రశాంత్‌కు ఇన్ ఫెక్షన్ అయిందని, అందువల్ల వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఉచిత సలహాలు ఇచ్చి, నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చాడు. ప్రశాంత్‌ను ఉన్నత వైద్యం కోసం బీదర్ తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యం వల్ల తన కుమారుడు చనిపోయాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని తండ్రి లక్ష్మణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కోటేశ్వర్‌రావు గ్రామానికి వెళ్లి విచారణ కొనసాగించారు.

లైసెన్స్ లేకుండా మందుల విక్రయం : కేసు నమోదు

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓ ఆర్‌ఎంపీ డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లెపల్లి గ్రామంలో సంగారెడ్డి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఓ ఆర్‌ఎంపీ వద్ద డ్రగ్ లైసెన్స్ లేకుండా పలు రకాల మందులు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు రూ.10 వేల విలువైన యాంటీబయోటిక్స్ తదితర మందులు స్వాధీనం చేసుకున్నట్లు సంగారెడ్డి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా మందుల విక్రయించడం పట్ల కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

విద్యార్థిని గాయపరిచిన ఉపాధ్యాయుడు


చెంపపై గాయాలైన విద్యార్థి హర్షవర్ధన్

చిన్నకోడూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు గాయపరిచిన సంఘటన చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని రామంచకు చెందిన పి. హర్షవర్ధన్ ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 18న పాఠశాలలో హిందీ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడు (గంటల ప్రతిపాదికన) సలీం హర్షవర్ధన్‌ను అకారణంగా కొట్టడం (వేళ్లతో చెంపపై రక్కడం)తో గాయాలయ్యాయని విద్యార్థి తండ్రి పర్శరాములు తెలిపారు. ఆ ఉపాధ్యాయుడు గతంలో కూడా తన కుమారుడిని కొట్టాడని ఆరోపించారు. ఈ ఘటనపై ఎంఈవో యాదవరెడ్డికి, పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్ కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం

పటాన్‌చెరు సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్తున్న ఓ యువకుడిని టిప్పర్ ఢీకొని దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీశైలం తెలిపిన వివరాలు ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం హంస గ్రామానికి చెందిన నందకుమార్ (22) ఇంద్రేశం పురపాలక పట్టణం సిటీజన్ కాలనీలో బావ లక్ష్మణ్ ఇంటిలో ఉంటున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడ గ్రాండ్‌ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున మోటారు సైకిల్‌పై పాశమైలారం వెళ్తుతుండగా మార్గమధ్యంలో ఔటర్ సర్వీస్ రోడ్డుపై ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు.

చెరువులో పడి యువకుడి మృతి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామంలో చోటు చేసకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీపేట రమేష్ (32) గ్రామ శివారులోని రెడ్డి చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. రమేష్ ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.



లక్ష్మికి కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎనిమిదేళ్ల తర్వాత అందిన 'కల్యాణలక్ష్మి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వివాహమైన ఎనిమిదేళ్లకు లబ్ధిదారురాలికి కల్యాణలక్ష్మి చెక్కు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దశంకరంపేట మండలం ఇసుకపాయల తండాకు చెందిన లక్ష్మీ కూతురు వివాహం 2017లో జరిగింది. అప్పట్లోనే కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరైంది. అయినా అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెకు చెక్కు అందించలేదు. ఎలాగైనా కల్యాణలక్ష్మి డబ్బులు అందించాలని స్థానిక నాయకుల ద్వారా ప్రస్తుత ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కోరింది. స్పందించిన ఆయన మెదక్ కలెక్టర్‌తో చర్చించి కల్యాణలక్ష్మి చెక్కు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే శనివారం నారాయణఖేడ్‌లో లక్ష్మికి కల్యాణలక్ష్మి చెక్కును అందించారు. వివాహమైన ఎనిమిదేళ్లకు కల్యాణలక్ష్మి చెక్కు అందడంపై బాధితురాలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, కాంగ్రెస్ నాయకులు నారాగౌడ్, పెనుమండ్లగౌడ్, రవీందర్‌నాయక్, రమేష్ చౌహాన్, నెహ్రూనాయక్, తదితరులు ఉన్నారు.

సిద్దిపేట ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన సిద్దిపేట జిల్లా ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు

సిద్దిపేట సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు సిద్దిపేట జిల్లా జట్టు ఎంపికైందని ఫుట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ నవాబ్ తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు టోర్నమెంట్ నిర్వహించనుండగా, సిద్దిపేట ఫుట్‌బాల్ మైదానంలో శనివారం ఎంపికలను నిర్వహించారు. వివిధ మండలాల నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఆదివారం నుంచి క్యాంపు నిర్వహించనున్నారు.

166 కేజీల ఎండు గంజాయి పట్టివేత



ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రవాణా చేస్తున్న ఎండుగంజాయిని పట్టుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయికి చెందిన గౌస్, షారూబ్‌ఖాన్ ఒడిస్సా రాష్ట్రంలో ఎండు గంజాయిని కొనుగోలు చేసి కారులో ముంబయికి తరలిస్తుండగా రామచంద్రాపురం ఇక్రిశాట్ టోల్‌గేటు వద్ద శనివారం సీఐ జగన్నాథ్, ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 83 ప్యాకెట్లు కలిపి 166 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో 3.8 కిలోలు..

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో 3.8 కిలోల గంజాయి పట్టుబడింది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం కందమాల్ తాలూకా ఫుల్బాని గ్రామానికి చెందిన భీమల్ లోచన్ పట్నాయక్ (38), ఒడిస్సాలోని కాశీనగర్‌కు చెందిన మోహన్ పండ (29) ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో నివాసముంటూ ప్లంబర్లుగా పనిచేస్తున్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట వద్ద శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై అనుమానస్పదంగా వెళ్తున్న వీరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 3.8కిలోల గంజాయి లభించింది. నిందితులు ఒడిస్సా నుంచి గంజాయి తీసుకొని వచ్చి సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారు. ఈ మేరకు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

జైలులో కుదిరిన స్నేహం.. బృందంగా ఏర్పడి చోరీలు

నర్సాపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని నర్సాపూర్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను ఎస్‌ఐ లింగం శనివారం విలేకరులకు వెల్లడించారు. నర్సాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా ముగ్గురు ఒకే స్కూటీపై అనుమానస్పదంగా తిరుగుతూ కనిపించారు. దీంతో వారిని అదుపులో తీసుకుని విచారించగా చోరీ బయటపడింది. నర్సాపూర్ మండలం ఎర్రకుంటతండాకు చెందిన ముడావత్ అంజయ్య, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నెల్లురుకు చెందిన కృష్ణరెడ్డి, టేక్మాల్ మండలానికి చెందిన నెమలి శ్రీనివాస్ గతంలో పలు చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లగా... అక్కడ ముగ్గురు స్నేహితులయ్యారు. బయటికి వచ్చిన తరువాత వారు ఒక గ్రూప్‌గా మారి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నర్సాపూర్, సంగారెడ్డి ప్రాంతాల్లో పలు దుకాణాల్లో చోరీ చేశారు. వీరి వద్ద నుంచి స్కూటీ, 20తులాల వెండి, రూ.2వేలు, ఇనుప రాడ్లు, స్క్రూడ్రైవర్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వారం క్రితం మండలంలోని నారాయణపూర్‌లో వరుసగా ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డ కొల్చారం మండలం నాయినిజలాల్‌పూర్‌కు చెందిన నీరుడికృష్ణను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వెల్దుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరి జరిగిన ఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీను ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తన బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి రాగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 5గ్రాముల బంగారం కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకోని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

కొమురవెల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగికి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గౌరాయపల్లిలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెద్ది మధుసూదన్‌రెడ్డి(25) శనివారం పురుగుల మందు తాగాడు గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై ఇంకా ఫిర్యాదు అందలేదని కొమురవెల్లి పోలీసులు తెలిపారు.



మధుసూధన్ రెడ్డి (ఫైల్)

అప్పుడు భర్తకు.. ఇప్పుడు భార్యకు..

- ఇద్దరి మృతదేహాలు వెలికి తీసి డీఎన్‌ఏ టెస్ట్.. రెండూ మిస్సింగ్ కేసులే
- ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి.. తమవాడేనంటూ తీసుకెళ్లి కర్మకాండలు
- డీఎన్‌ఏ టెస్ట్‌లో మునిపల్లివాసిగా ఫలితం
- హత్యకు గురై కాలిన స్థితిలో మహిళ మృతదేహం
- తీసుకొచ్చి కర్మకాండలు చేసిన కొడుకు.. డీఎన్‌ఏ టెస్ట్‌లో సరిపోలని వైనం
- తాజాగా మరోసారి మృతదేహం వెలికి తీసి శాంపిల్స్ సేకరణ

మునిపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ భార్యభర్తలు. వేర్వేరు సమయాల్లో ఇంటి నుంచి కనిపించకుండా పోయారు. జాతీయ రహదారిపై దొరికిన మృతదేహాన్ని ఓ గ్రామానికి చెందిన వారు తమ వాడేనని తీసుకెళ్లి కర్మకాండ చేశారు. తర్వాత ఆ గ్రామానికి వెళ్లిన వారు అక్కడ ఫొటో చూసి.. తమ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇక్కడ శ్రద్ధాంజలి ఘటిస్తూ ఫొటో పెట్టడం ఏంటని బంధువులకు సమాచారం ఇచ్చారు. అప్పట్లో డీఎన్‌ఏ టెస్ట్ చేసిన పోలీసులు మరణించింది కర్మకాండ చేసిన వారికి సంబంధించిన వ్యక్తి కాదని తేల్చారు. ఆ తర్వాత ఎనిమిదేళ్లకు మరణించిన వ్యక్తి భార్య కూడా కనిపించకుండా పోయింది. ఓ అటవీ ప్రాంతంలో ఓ మహిళ హత్యకు గురై మృతదేహం లభ్యం కాగా, సెల్ ఫోన్ ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పూర్తిగా కాలిపోయి ఉండటంతో బంధువులు తీసుకు వచ్చి కర్మకాండలు చేశారు. అయితే, ఆ మహిళ మృతదేహానికి డీఎన్‌ఏ టెస్ట్ చేయగా, కుమారుడి డీఎన్‌ఏతో సరిపోలేదు. దీంతో మరోసారి డీఎన్‌ఏ టెస్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పాతిపెట్టిన శవాన్ని బయటకు తీశారు. ఇలా భార్యాభర్తలు కనిపించకుండా పోవడం, ఇద్దరికీ డీఎన్‌ఏ టెస్ట్ చేయడం స్థానికంగా చర్చనీయంశమైంది. ఇందుకు సంబంధించి వివరాలు..

సంగారెడ్డి జిల్లా మునిపల్లికి చెందిన చెవుల అనుసూజ(53) 2024 మే 18న కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మునిపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సెల్‌సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టడంతో మెదక్ జిల్లా ఏడుపాయల వద్ద హత్యగు గురైనట్లు తేలింది. మునిపల్లి గ్రామానికే చెందిన బస్వరాజ్ ఆమెకు మాయమాటలు చెప్పి హత్య చేసి, మృతదేహాన్ని తగులబెట్టినట్లు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని జైలు పంపించారు. మరణించింది ఎవరనే విషయం తేల్చడం కోసం అప్పట్లోనే డీఎన్‌ఏ టెస్ట్ కోసం పది రోజుల తర్వాత శవాన్ని వెలికి తీసి శాంపిల్స్ సేకరించారు. అవి ఆమె కుమారుడైన చెవుల ప్రవీణ్‌తో సరిపోలలేదు. దీంతో మరోసారి డీఎన్‌ఏ టెస్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం గ్రామంలోని శ్మశాన వాటికలో అనుసూజ సమాధిని ఆమె కుమారుడు చెవుల ప్రవీణ్, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో తవ్వి తీశారు. సదాశివపేట సీఐ వెంకటేశ్, మునిపల్లి ఎమ్మార్వో గంగాభవానీ, ఎస్సై రాజేష్ నాయక్‌ల ఆధ్వర్యంలో సంగారెడ్డి మెడికల్ కాలేజీ డాక్టర్ రాముల నేతృత్వంలో డీఎన్‌ఏ టెస్ట్ కోసం అవసరమైన శాంపిల్స్ తీసుకున్నారు.

తమవాడేనంటూ..

చెవుల అనుసూజ భర్త చెవుల పద్మారావు ఎనిమిదేళ్ల క్రితం 2016 డిసెంబర్ 4న కనిపించకుండా పోయాడు. అదే సమయంలో ఇదే మండలం పిల్లోడి గ్రామానికి చెందిన మరో వ్యక్తి కూడా అదృశ్యమయ్యాడు. ఈ మేరకు వేర్వేరు మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయి. తర్వాత మండలంలోని బుదేరా గ్రామ శివారు ముంబై జాతీయ రహదారిపై జరిగిన ఓ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అప్పటికే పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయి ఉండగా, ఆ ఇద్దరిలో ఎవరైనా ఉన్నారేమో అన్న కోణంలో పోలీసులు ఇరు కుటుంబాల వారిని పిలిపించి, మృతదేహాన్ని చూపించారు. దీంతో పిల్లోడి గ్రామానికి చెందిన వారు చనిపోయింది తమ వ్యక్తే అంటూ తీసుకెళ్లారు. కార్యక్రమాలు చేసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత మునిపల్లికి చెందిన కొందరు పిల్లోడి గ్రామానికి పని నిమిత్తం వెళ్లారు. అక్కడ చెవుల పద్మారావు ఫొటో కనిపించడంతో తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఫొటో ఇక్కడ ఉండటం ఏమిటని గ్రామంలోని వారికి ఫోన్ చేశారు. ఇక్కడ తాము ఫొటో చూశామని చెప్పడంతో వారు మునిపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు పిల్లోడి గ్రామానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో చనిపోయింది ఎవరనే విషయం తెలుసుకునేందుకు మృతదేహాన్ని వెలికి తీసి డీఎన్‌ఏ పరీక్షలు చేశారు. దీంతో చనిపోయింది చెవుల పద్మారావుగా తేలడం అప్పట్లోనే సంచలమైంది.



అనుసూజ సమాధి తవ్వుతున్న పోలీసులు



అనుసూజ (ఫైల్)

గ్రామంలో తీవ్ర చర్చ

ఎనిమిదేళ్ల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ కనిపించకుండా పోవడం.. ఒకరిని తీసుకెళ్లి కర్మకాండ చేయడం.. తర్వాత పద్మారావుగా తేలడం.. ఇప్పుడు కనిపించకుండా పోయిన అనుసూజ మృతదేహంపై అనుమానాలు ఉండటంతో గ్రామంలో త్రీవ చర్చ జరుగుతోంది. అనుసూజ డీఎన్‌ఏ టెస్ట్ కుమారుడితో మ్యాచ్ కాకపోవడంతో అసలు చనిపోయింది ఎవరూ.. గతంలో అతని త్రండికి జరిగినట్లే.. ఎవరో చనిపోతే తీసుకొచ్చి కర్మకాండ చేశారా అన్న చర్చ కూడా జరుగుతోంది.

పండుగకు ఊరెళ్తున్నారా.. జరభద్రం..!



● సంగారెడ్డి, మెదక్ ఎస్పీలు పరితోష్ పంకజ్, డీవీ శ్రీనివాసరావు

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగకు ఊరెళ్లవారు తగు జాగ్రత్తలు పాటించాలని సంగారెడ్డి, మెదక్ ఎస్పీలు పరితోష్ పంకజ్, డీవీ శ్రీనివాసరావు సూచించారు. విద్యా సంస్థలకు దసరా సెలవులు రావడంతో చాలామంది తమ సొంతూళ్లకు వెళ్లే అవకాశముందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని దొంగలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించవచ్చున్నారు. అలాగే ప్రయాణాలు చేసే సమయంలో రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

ప్రజలకు పోలీసు వారి సూచనలు

- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం.
- ఊర్లకు వెళ్తున్నప్పుడు పక్కింటి వారిని ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి.
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు.
- ఊళ్లకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల, ఇంటి బయట ఒక లైటు వేసి ఉంచాలి.
- ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేయాలి.
- ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- సిసి కెమెరాలను ఇంటర్నెట్ కు అనుసంధానం చేస్తే మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా ప్రత్యక్షంగా చూసుకునే వీలుంటుంది.
- ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. తమ ప్రాంతం పరిధిలోని పోలీస్ స్టేషన్ అధికారి ఫోన్ నెంబర్ ఇతర అధికారుల నెంబర్‌లు ప్రజలు తమ సెల్ ఫోన్ లలో ఉంచుకోవాలి.
- అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100 కు గాని సంబందిత పోలీస్ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలి.
- సుదూర ప్రాంతాల ప్రయాణాలకు వెళుతున్నట్లైతే, సమీప పోలీసు స్టేషన్‌లలో మీ ఫోన్ నంబర్లు ఇచ్చి వెళ్లాలని, తద్వారా ఎలాంటి విపత్కర పరిస్థితులలో నైనా గుర్తించడానికి వీలుగా ఉంటుంది.

బైరాన్‌పల్లిని వీరబైరాన్‌పల్లిగా మార్చాలి

● సీఎంకు ఎంపీ చామల వినతి

మద్దూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిని వీరబైరాన్‌పల్లిగా మార్చాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నిజాం రజాకార్లకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన నెత్తుటి చరిత్ర అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ కదిలించడంతో సైనిక చర్యతో నిజాం లొంగిపోయాడని, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు అందించిన బైరాన్‌పల్లి అమరవీరుల గ్రామాన్ని వీరబైరాన్‌పల్లిగా మార్చాలన్నారు. నాడు బైరాన్‌పల్లిలో జరిగిన మారణహోమం జలియన్‌వాలా భాగ్ ఘటనను తలపించినట్లు వివరించారు. రజాకార్లు 1200 మంది సైన్యంతో ఆగస్టు 27న జనగామ తాలుకా మీదుగా వెల్దండ నుంచి లద్నూరు మద్దూరు మీదుగా బైరాన్‌పల్లికి చేరుకుని 118 మందిని కాల్చి చంపారన్నారు. కూటిగల్‌లో 30 మందిని ఊచకోత కోసి నరమేధాన్ని సృష్టించారన్నారు. ఈ ఘటనకు నాటి బురుజు, మైసమ్మ మర్రి, కూటిగల్‌లోని తూటాల మర్రి నేటికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయన్నారు. బైరాన్‌పల్లి వీరుల పోరాటాల త్యాగాలకు గుర్తుగా చరిత్రను భావితరాలకు తెలిసేలా గ్రామాన్ని వీరబైరాన్‌పల్లిగా మార్చాలని అభ్యర్థించినట్లు తెలిపారు. ఈ విషయంపై సీఎంకు విన్నవించినందులకు ఎంపీ చామలకిరణ్‌కుమార్‌రెడ్డికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



పూలు చల్లి శాలువా కప్పి, చాక్లెట్లు తినిపించి..

ఉపాధ్యాయుడికి విద్యార్థుల సత్కారం

రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నారని..

సార్‌కు సర్‌ప్రైజ్..

వర్గల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోజులాగానే ఆ ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి అడుగు పెట్టారు. అంతే విద్యార్థులంతా చుట్టు ముట్టి సార్‌పై పూల వర్షం కురిపించారు. శాలువాతో సత్కరించి, చాక్లెట్ తినిపించి సార్‌ను సర్‌ప్రైజ్‌లో ముచ్చెతారు. కారణం.. ఆ సార్ రైతు కుటుంబాలకు అండగా ఉంటూ వారికి చేయూతనిస్తుండమే. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికిఖాల్సా ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిింది. ఈ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు పులి రాజు కొన్నేళ్లుగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు అండా నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ రైతు ఆత్మహత్య జరిగిన వెళ్లి ఆ కుటుంబం స్థితిగతులు, ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని, దాతల సహకారంతో ఆ కుటుంబానికి చేతనైన సహాయం అందిస్తుంటారు. ఆయన సేవలు పత్రికల్లో కథనాలుగా కూడా అచ్చయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆయన గురించి గొప్పగా చెబుతుంటారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు శనివారం తమ అభిమాన ఉపాధ్యాయుడిని సన్మానించాలని భావించారు. కొందరు ఇంటి నుంచి పూలను తీసుకువచ్చారు. మరికొందరు శాలువ, చాకెట్లు ఇలా తీసుకువచ్చారు. శనివారం ప్రేయర్ కాగానే ఉపాధ్యాయుడు పులి రాజు నాలుగో తరగతి గదిలోకి రాగానే విద్యార్థులంతా కలిసి ఆయనపై పూలు చల్లారు. కుర్చీలో కూర్చొబెట్టి శాలువతో సన్మానించి, చాక్లెట్ తినిపించడంతో సదరు ఉపాధ్యాయుడు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదేమిటని ప్రశ్నిస్తే 'మీరు రైతులకు చేస్తున్న సేవలు చూసి, సన్మానం చేయాలనిపించింది' అన్నారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష

విద్యార్థుల ఆవిష్కరణలు వెలికితీసే అవకాశం

ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకాలు

ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

ఈ నెల 30 వరకు దరఖాస్తుకు చాన్స్



2025 - 26

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న ఆవిష్కరణలను పదును పెట్టేలా, పరిశోధనలు, ప్రయోగాలలో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం 'విద్యార్థి విజ్ఞాన మంథన్(వీవీఎం)' అనే జాతీయ స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం కూడా ఈ పరీక్షకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన భారతి సంస్థలు సంయుక్తంగా ఈ పరీక్షలను నిర్వహిస్తున్నాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు భారతదేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థలలో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంది.

పరీక్ష, ప్రోత్సాహకాలు

సైన్స్ సబ్జెక్టు పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగించడమే ఈ పరీక్ష ప్రధాన లక్ష్యం. పరీక్ష రెండు విభాగాలలో ఉంటుంది. జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు, సీనియర్ విభాగంలో 9, 10, 11 (ఇంటర్ మొదటి సంవత్సరం) తరగతుల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావచ్చు. తెలుగు, ఇంగ్లిష్, హిందీతో పాటుగా 14 భాషల్లో ఈ పరీక్షను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తారు. విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇస్రో, డీఆర్‌డీవో, సీఎస్‌ఐఆర్, బీఏఆర్‌సీ, ఐఐఎస్ఈఆర్, ఐఐసీటీ , ఎన్‌ఐఎన్ వంటి జాతీయ పరిశోధన సంస్థలలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం లభిస్తుంది. అంతే కాకుండా, పలు స్కాలర్‌షిప్‌లను కూడా అందజేస్తారు. పాఠశాల స్థాయిలో 18 మందిని ఎంపిక చేస్తారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2వేల ఉపకార వేతనం, సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థుల్లో మొదటి బహుమతిగా రూ.26వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందిస్తారు. 'భాస్కర స్కాలర్‌షిప్' పేరుతో ఏడాది పాటు నెలకు రూ.2 వేలు చెల్లిస్తారు.

పరీక్షకు హాజరయ్యేలా చూడాలి



విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచి, కొత్త ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడానికి వీవీఎం పరీక్ష ఉపయోగపడుతుంది. విద్యార్థులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో పాల్గొనడం జిల్లా విద్యార్థులకు ఒక మంచి అవకాశం.

\- కల్లెపల్లి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి

దరఖాస్తు విధానం

విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రూ.200 చెల్లించి విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభంకాగా, ఈ నెల 30 వరకు గడువు ఉన్నది. పరీక్ష జరిగే రోజున విద్యార్థులు తమ వద్ద అందుబాటులో ఉన్న మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ వంటి డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒకదాని నుంచి ఒక నిర్దేశిత అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ అప్లికేషన్ ద్వారా పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఎక్కడి నుంచైనా పరీక్షకు హాజరు కావచ్చు. ఈ పరీక్ష సాధన కోసం వెబ్‌సైట్‌లో పుస్తకాలు కూడా అందుబాటులో ఉంటాయి. లెవెల్ 1కు సంబంధించిన పాఠశాల స్థాయి పరీక్షలు అక్టోబర్ 28 నుంచి 30 వరకు, జిల్లా స్థాయి పరీక్ష నవంబర్ 19న, జాతీయ స్థాయి పరీక్ష 2026 మే నెలలో ఉంటాయి.

రేపటి నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- పరీక్షకు హాజరుకానున్న 893 మంది అభ్యర్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సీ కోర్సు అభ్యాసకులకు సప్లిమెంటరీ(థియరీ)పరీక్షలు ఈ నెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. రెగ్యుర్ మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పదో తరగతి ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, అదే విధంగా ఇంటర్మీడియట్ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ 621 మంది, ఎస్ఎస్‌సీ 272 మంది, మొత్తం 893 మంది అభ్యాసకులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్నది. పరీక్ష సమయం కంటే గంట ముందుగానే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి నిషేధిత మెటీరియల్‌కు అనుమతి ఉండదని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తి వివరాలకు 08455-276434, 8008403635 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా జడ్జి సంగారెడ్డి జైలు ఆకస్మిక తనిఖీ

కంది, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర శనివారం కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సెంట్రల్ జైలు నందు ఉన్న బ్యారక్‌లు, గదులు, వంటగది, బాత్రూంలు, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూసి, ఖైదీల కోసం వండే కూరగాయలు, బియ్యం, ఉన్న స్టోర్‌రూమ్‌తో పాటు జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఆమె తనిఖీలు చేశారు. అనంతరం ఖైదీలను జైలులో ఉన్న సదుపాయాలను, భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని ఖైదీలకు కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్‌కు సూచించారు. ఖైదీలకు సమయానికి బెయిల్స్ ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. ఖైదీల కేసులు పరిష్కరించేందుకు, న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలిపారు. ఆమె వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, జైలు సిబ్బంది ఉన్నారు.


జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో గల క్రిష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


మెదక్ అర్బన్ : మంబోజిపల్లి గీతా హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


మెదక్ అర్బన్ : మెదక్ సిద్ధార్థ్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ


బతుకమ్మ వేడుకల సందర్భంగా సంగారెడ్డిలోని విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్‌లో మహిషాసురవధ నృత్య రూపకంలో విద్యార్థినులు

ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ అని పలువురు పేర్కొన్నారు. శనివారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఆయా పాఠశాల మైదానాలు విద్యార్థినుల ఆటపాటలతో హోరెత్తాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలతో లయబద్ధంగా ముందుకుసాగారు.

- న్యూస్ నెట్‌వర్క్


మునిపల్లి మండలం తాటిపల్లి యునైటెడ్ పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు


సంగారెడ్డిలోని న్యూ బోధి పాఠశాలలో బతుకమ్మ సంబరాలలో చిన్నారులు, ఉపాధ్యాయులు


నాగల్‌గిద్ద మండల కేంద్రంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను జరుపుకుంటున్న గాయత్రి పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది


మనోహరాబాద్ మండలం దండుపల్లి బాల్యం పాఠశాలలో బతుకమ్మ సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు


ఝరాసంగం : అక్షర భారతి మోడల్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న చిన్నారులు


వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు


నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట ఉన్నత పాఠశాల బతుకమ్మ సంబరాల్లో ఆర్డీవో, జిల్లా సైన్స్ అధికారి


గుమ్మడిదలలోని శ్రీ వివేకానంద హైస్కూల్లో బతుకమ్మతో వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

న్యూస్ బాక్స్

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

హవేళిఘణపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన ఎరువులు, విత్తనాలతో అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. శనివారం మండలలోని ఔరంగాబాద్ గ్రామంలో సాగుచేసిన పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాకేష్, రైతులు సంగం, భూమేష్, రవి, పూల్‌సింగ్ పాల్గొన్నారు.

గ్రామ కంఠ భూమిని రక్షించండి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామ దుర్గమ్మ ఆలయానికి సంబంధించిన గ్రామ కంఠ భూమి కబ్జాకు గురైందని, రక్షించాలని గ్రామస్థులు శనివారం తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో గిరిజారాణికి వినతిపత్రం అందజేశారు. గ్రామ పొలిమరలో ఉన్న దుర్గమ్మ ఆలయానికి 15 సెంట్ల గ్రామ కంఠం, కందం భూమి ఉందని ఓ రియల్టర్ రాజకీయ అండతో కబ్జాచేసి కంచె ఏర్పాటు చేశాడని తెలిపారు. అతనిపై చర్యలు తీసుకుని, భూమిని కాపాడాలని కోరారు.

విద్యుదాఘాతంతో కోతి మృతి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో కోతి మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. శుక్రవారం రాత్రి ఓ కోతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగలపై దూకింది. దీంతో తీగలె తెగి కిందకు వేలాడి, రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది చేరుకుని మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరపరా కల్పించారు.

స్వచ్ఛత హీ సేవా ర్యాలీ

తూప్రాన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో శనివారం మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ నిర్వహించారు. తూప్రాన్ పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛతపై నినాదాలు చేశారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి : సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు వాగ్దేవి జూనియర్ కళాశాల, ఆచార్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదువుకున్నప్పుడే పోటీ పరీక్షల్లో రాణించగల్గుతారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ దారం శంకర్, కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్, న్యాయవాది సంగన్న, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే మండల పరిధిలోని జి.హుక్రానాలో రూ.20 లక్షలతో జీపీ భవనం పనులకు,


ఫ్రెషర్స్ డేలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం పనులకు. చల్లగిద్దతండాలో అంగన్‌వాడీ భవనం, ప్రహరీ, మురుగు కాల్వ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ దారం శంకర్, వెంకట్‌రాంరెడ్డి, తాహేర్‌అలీ, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

మాణయ్య వ్యక్తి కాదు.. గొప్ప శక్తి : రాజిరెడ్డి

హత్నూర/నర్సాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వర్గీయ చార్ల మాణయ్య వ్యక్తి కాదు.. గొప్ప శక్తి అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి అన్నారు. శనివారం మాణయ్య 5వ వర్ధంతి సందర్భంగా లింగాపూర్‌లో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని గర్భిణులకు మాతృదేవోభవ పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి మాట్లాడుతూ మరణించి ఐదేళ్లు గడిచినా కాంగ్రెస్‌కు, ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీం, పార్టీ మండల అధ్యక్షుడు


మాణయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న రాజిరెడ్డి

కృష్ణ, కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు సజాత, నాయకులు పాల్గొన్నారు. అలాగే నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నర్సాపూర్, వెల్దుర్తి మండలాలకు చెందిన పలువురికి రరూ.12.78 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆవుల రాజిరెడ్డి అందజేశారు.

కాలనీల్లో నిర్విరామంగా విద్యుత్ సరఫరా


పటాన్‌చెరు శిశుమందిర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో అంతరాయం లేని విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ జేపీకాలనీ, శిశు మందిర్ కాలనీల్లో కురుస్తున్న వర్షాలకు విద్యుత్ తీగలు తెగడం, స్తంభాలు ఒరిగిపోవడం వంటి సమస్యలపై విద్యుత్‌శాఖ డీఈ భాస్కర్ రావుతో కలిసి పర్యటించారు. విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలపై కార్పొరేటర్ డీఈకి వివరించారు. అనంతరం సీసీరోడ్ల పనులు పరిశీలించారు.

జహీరాబాద్‌లో మోస్తరు వర్షం

జహీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతంలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ముందుగా నల్లని మబ్బులతో ఆకాశం మేఘావృతమైంది. మండంలోని కొత్తూర్(బి) గ్రామంతోపాటు న్యాల్‌కల్, హద్నూర్, గంగ్వార్ చౌరస్త తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

జహీరాబాద్ రెగ్యులర్ ఆర్డీవోగా దేవుజ

జహీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ రెగ్యులర్ ఆర్డీవోగా దేవుజను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆర్డీవోగా కొనసాగిన రాంరెడ్డిని మహబూబ్‌నగర్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీచేశారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా ఉన్న దేవుజ 15 రోజులుగా జహీరాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవోగా కొనసాగుతున్నారు. ప్రభుత్వం ఆయనను రెగ్యులర్ ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించాడు.

పరేడ్‌తో సిబ్బందిలో క్రమశిక్షణ పెరుగుతోంది

మెదక్ అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పరేడ్‌తో పోలీసు సిబ్బందిలో క్రమశిక్షణ పెరుగుతోందని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన పరేడ్‌కు ఆయన హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి శనివారం పరేడ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు ప్రజలకు ఎంతో మేలు

నర్సాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు వల్ల మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు కలుగనుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ మూడు పర్యాయాలు కేంద్రంలో బీజేపీ అధికారంలో రాగా ప్రధానిగా మోదీ పాలన ఆధ్వర్యంలో పాలన ఒక్క అవినీతి మరక లేకుండా దేశాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు జీఎస్టీ వల్ల కలిగే లాభాలను గ్రామగ్రామాన పార్టీ శ్రేణులు ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఓబీసీమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, సీనియర్ నాయకుడు పెద్దరమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

రామచంద్రాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్‌లో నిర్మిస్తున్న నిర్మాణాలపై మరోమారు గ్రామస్థులు మున్సిపల్ కమిషనర్ అజయ్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే కాలనీ వద్ద నిర్మిస్తున్న ఓ నిర్మాణ సంస్థ కాలనీకి వెళ్లే రహదారిని ఆక్రమించుకుంటూ నిర్మాణాలు చేపడుతుందన్నారు. ఇప్పటికే ఓపెన్ డ్రైనేజీని కలుపుకుని ప్రహరీ నిర్మించారని ఆరోపించారు. ప్రస్తుతం గేట్‌ను ఏర్పాటు చేయడం, దాని ముందు ఆర్చీ నిర్మిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, అరుణ్‌గౌడ్, నర్సింహ, దేవేందర్ యాదవ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు క్రమశిక్షణ అవసరం : డీఎస్పీ

తూప్రాన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసులకు క్రమశిక్షణ, విధుల్లో నిబద్ధత అవసరమని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ పట్టణంలో సర్కిల్ స్థాయి పరేడ్‌ను డీఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం, యాదగిరి పాల్గొన్నారు. అనంతరం తూప్రాన్ సబ్ డివిజన్ స్థాయిలో వివిధ నేరాలపై సమీక్షా సమావేశం నిరరించారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ పరిధిలో తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట సర్కిల్స్ పరిధి సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే తూప్రాన్ సబ్ డివిజన్ పరిధిలో సర్కిల్‌వారీగా ఉత్తమ


తూప్రాన్‌లో సర్కిల్ స్థాయి పరేడ్ పరిశీలిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

ప్రతిభ చూపిన కానిస్టేబుళ్లు నాగరాజు(తూప్రాన్), సాయిబాబా(నార్సింగి), హరిబాబు(నర్సాపూర్)ను ఆయన సత్కరించారు.

రామ, లక్ష్మణుల అనుబంధం ఆదర్శం

కల్హేర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రామ, లక్ష్మణుల అనుబంధానికి శక్తి మహోత్సవం ఆదర్శమని అంతర్గాం గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతిమహరాజ్ అన్నారు. మండల పరిధిలోని క్రిష్టాపూర్‌లో ఆరునెలలుగా సూచక్, వాచక్‌లు విఠల్‌రావ్, ధర్మారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రామాయణ పారాయణంలో అతి ముఖ్యమైన లక్ష్మణ శక్తి మహోత్సవం శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఆయన పాల్గొని ప్రవచనం చేస్తూ లోకంలో రామాయణానికి ఎంతో ప్రాముఖ్యం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్ రెడ్డి, నాయకులు బేతయ్య, కిష్టారెడ్డి, శ్రీనివాస్‌గౌ


లక్ష్మణ శక్తి మహోత్సవం గురించి వివరిస్తున్న మహారాజులు

డ్‌తో పాటు సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలతో పాటు సరిహద్దులో ఉన్న కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమతుల దందా

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదుదారులను బెదిరిస్తున్నారని వాపోతున్నారు. పంచాయతీ పరిధిలో ఇటీవల నిర్మించిన ఇళ్లకు హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం సెట్ బ్యాక్ వదిలిన దాఖలాలు లేవని, ఇలాంటి ఇళ్లకు అనుమతుల్విడానికి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. కంది గ్రామం హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా హెచ్‌ఎండీఏ అధికారులు నిర్మాణాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు.

ఆదినారాయణను దర్శించుకున్న అదనపు కలెక్టర్


ఆదినారాయణస్వామి ఆలయంలో మాధురి

జిన్నారం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొడకంచి ఆదినారాయణ స్వామి ఆలయాన్ని అదనపు కలెక్టర్ మాధురి శనివారం సందర్శించారు. అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కోనేరు, ఇతర నిర్మాణాలు పరిశీలించి, ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవదాస్, ఆర్ఐ జయప్రకాష్, ఆలయ ఛైర్మన్ రామాజీరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగుల ముందస్తు అరెస్టు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ వెళ్లకుండా ముందస్తుగా శనివారం కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి డప్పు నర్సింహులు మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి చాలీచాలని వేతనాతో విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను గుర్తించి రెగ్యులరైజేషన్ చేసి, అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువు కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి వనరుల గణన పక్కాగా నిర్వహించాలి

హత్నూర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో గల నీటి వనరుల లెక్క పక్కాగా చేయాలని తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ జీపీవోలకు సూచించారు. హత్నూర రైతువేదికలో శనివారం ఏర్పాటుచేసిన జీపీవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 2024-28 సంవత్సరానికిగాను నీటి వనరులను గుర్తించి జియో ట్యాకింగ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్‌వో చంద్రకళ, డిప్యూటీ తహసీల్దార్ దావూద్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ర్యాకల్‌కు చెందిన మాజీ సర్పంచ్ బూత్కూరు అంజిరెడ్డి పత్తిని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. శనివారం పొలానికి వెళ్లేసరికి 300ల వరకు మొక్కలను చిన్నాభిన్నం చేశారని, రూ.30 వేల వరకు నష్టం వాటిల్లుతుందన్నారు. పోలీసులు పంటను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అంజిరెడ్డి కోరారు.

స్పెషలాఫీసర్‌కు షోకాజ్ నోటీసులు

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోర్గి మోడల్ హాస్టల్ స్పెషల్ ఆఫీసర్‌కు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు శనివారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. హాస్టల్లో పలు సమస్యలు ఉండడంతో శుక్రవారం సబ్ కలెక్టర్ ఉమాహారతి, నాగల్‌గిద్ద ఎంఈవో హాస్టల్‌ను సందర్శించి, విచారణ చేపట్టారు. ఆమె విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారన్నారు.

పంచాయతీ కార్యదర్శి వేధింపులు

● పారిశుధ్య కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

నిజాంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి వేధింపులు తాళలేక పారిశుధ్య కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నిజాంపేట మండల కార్యదర్శి నర్సింలు సఫాయి కార్మికురాలు కొమ్మాట ఇందిరకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఇదేంటని అడిగితే గట్టిగా మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఇందిర ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం సాయంత్రం గడ్డి మందు తాగి స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన సోదరుడు బాబు నార్సింగి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.

యువతి అదృశ్యం


కవిత(ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం మహ్మదాబాద్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన లున్సావత్ బిక్య కూతురు కవిత(21) ఇంటర్ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 18న రాత్రి అందరూ నిద్రపోయాక ఎటో వెళ్లిపోయింది. ఉదయం లేచిన కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

బైక్ దొంగ అరెస్టు, రిమాండ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతనం చేసిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ మహేష్ తెలిపారు. చేగుంట మండల పరిధిలోని బి. కొండాపూర్ గ్రామానికి చెందిన యాదగిరి శుక్రవారం మెదక్ కోర్టు వద్ద నుంచి బైక్‌ను దొంగతం చేశాడు. దాంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం రాందాస్ చౌరస్తాలో యాదగిరిని పట్టుకొని విచారించగా.. దొంగతనం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

శివ్వంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బిజిలిపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల ఆహార పదార్థాలు తీసుకొచ్చి సందర్శనలో ఉంచారు. ఉపాధ్యాయులు వాటిని పరిశీలించి, అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు